సాక్షి పల్నాడు

బుధవారం । 13 । ఆగస్టు । 2025



నెమలి పింఛాల అలంకరణలో కనక దుర్గమ్మ

పిడుగురాళ్ల: భవానీనగర్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారిని మంగళవారం నెమలి పింఛాలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



18 నుంచి టీటీడీ పవిత్రోత్సవాలు

వెంకటపాలెం(తాడికొండ): ఈ నెల 18 నుంచి 21 వరకు వెంకటపాలెంలోని టీటీడీలో పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పర్యవేక్షణాధికారి మల్లిఖార్జున తెలిపారు.

అష్టలక్ష్మికి కుంకుమార్చన



తెనాలి: స్థానిక కొత్తపేటలోని అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారికి మంగళవారం లక్ష కుంకుమార్చన నిర్వహించారు. నిర్మలా నందగిరి స్వామి ఆశీస్సులతో కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ఈ వేడుక జరిపించారు.

న్యూస్‌రీల్

నాగార్జునసాగర్ డ్యామ్‌పై హర్ ఘర్ తిరంగా ర్యాలీ



విజయపురిసౌత్: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ భద్రతా దళాల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ గిరీష్ భట్ ఆధ్వర్యంలో భద్రతా బలగాలతో పాటు విద్యార్థులు జాతీయ జెండాలు చేతబట్టుకొని సాగర్ డ్యామ్‌పై భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. ర్యాలీగా విజయపురిసౌత్ కాలనీలో జరిగింది.అనంతరం మానవ హారంగా ఏర్పడ్డారు. గిరీష్ భట్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన అమరులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎస్‌కె మహమ్మద్‌బాషా, ఎన్‌సీసీ కెప్టెన్ కె. విజయకుమార్, జువాలజీ అధ్యాపకుడు టి. రాజశేఖర్, నాగార్జునకొండ సీఏ వెంకటయ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరిస్తాం



దాచేపల్లి: సంక్షేమ వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ గనోజ్ సూరజ్ అన్నారు. నారాయణపురంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఇటీవల ఈ హాస్టల్ లో జూనియర్ విద్యార్థిపై సీనియర్ విద్యార్థులు దాడి చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. ఘటన జరిగిన తీరును అక్కడున్న విద్యార్థులతోమాట్లాడి జేసీ తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ దాడి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఇటువంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. జేసీ వెంట ఆర్‌డీఓ మురళీకృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, బీసీ వెల్ఫేర్ అధికారి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

బీసీ హాస్టల్‌ను సందర్శించిన ఎమ్మెల్యే

నారాయణపురం ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహాన్ని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కూడా సందర్శించారు.

నేటి నుంచి త్రిశక్తి దుర్గాపీఠం వార్షిక బ్రహ్మోత్సవాలు



సత్తెనపల్లి: త్రిశక్తి స్వరూపిణులైన మహాలక్ష్మి, దుర్గ, సరస్వతి అమ్మవార్ల త్రిశక్తి దుర్గాపీఠం 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి 15 వరకు వైభవంగా జరగనున్నాయని పీఠాధిపతులు వెలిదండ్ల హనుమత్ స్వామి మంగళవారం తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 108 కళశాలతో అభిషేకాలు జరుగుతాయన్నారు. ప్రసన్నాంజనేయ స్వామి వారికి లక్ష నాగవల్లి దళాలతో (తమల పాకులు) విశేష పూజలు, శ్రీ జగన్నాథ భజన మండలి సభ్యుల కోలాటంతో అమ్మవార్ల ప్రభ ఉంటుందన్నారు. ముగింపు రోజు ముఖ్య శిష్యులచే గురుపూజ, అన్నప్రసాద వితరణ జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఘనంగా వినాయకునికి సంకటహర చతుర్థి పూజలు



అమరావతి: స్థానిక అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వర స్వామి ఉపాలయంలో మంగళవారం సంకటహర చతుర్థి పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జగర్లపూడి శేషసాయిశర్మ విఘ్నేశ్వర స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామి వారికి వివిధ రకాల పుష్పాలు, గరికతో విశేషాలంకారం చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్ళను సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

తెల్లబోయింది!

- సాగర్ నిండినా, సమృద్ధిగా వర్షాలు కురుస్తున్న ముందుకు సాగని ఖరీఫ్
- పత్తి సాగుకు గడువు ముగుస్తున్నా ముందుకురాని రైతులు
- 91,566 హెక్టార్ల సాధారణ సాగుకు గాను 35,958 హెక్టార్లలోనే..
- గులాబీ రంగు పురుగు ఉధృతితో పెరుగుతున్న పెట్టుబడి, తగ్గుతున్న దిగుబడులు
- ప్రభుత్వ 'మద్దతు' కూడా లేని వైనం
- మొక్కజొన్న, అపరాల పంటల వైపు మొగ్గుచూపుతున్న కర్షకులు

జిల్లాలో సగం కూడా దాటని పత్తి సాగు



పిడుగురాళ్ల రూరల్ మండల పరిధిలో పత్తిసాగు

సాక్షి, నరసరావుపేట: ఖరీఫ్ సీజన్‌లో సమృద్ధిగా వానలు కురిసాయి. నాగార్జున సాగర్ నీటిమట్టం పూర్తిస్థాయికి చేరి జూలై చివర వారంలోనే నీటిని కిందకు వదిలారు. దీంతో పల్నాడు జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాగు పూర్తిస్థాయిలో ఉంటుందని అంతా అనుకున్నారు. అయితే ఖరీఫ్ సాగు ప్రారంభమై రెండున్నర నెలలైనా జిల్లాలో ఇప్పటివరకు సాధారణ లక్ష్యంలో కనీసం 30 శాతం కూడా పంటలు సాగుకాలేదు. ముఖ్యంగా పల్నాడు రైతులు ఎక్కువగా ఆధారపడే తెల్లబంగారమైన పత్తి పంట సంగతి సరే సరి. పత్తి సాగుకు రైతన్నలు ముందుకు రావడం లేదు.

గిట్టుబాటు ధర లేకపోవడమే...

పత్తి పంట సాగు తగ్గిపోవడానికి ప్రధాన కారణం పత్తి సాగు ఖర్చు పెరగడం, పంటలకు చీడపీడల ప్రభావం అధికంగా ఉండటం. గులాబీ రంగు పురుగుతో రైతులకు మందుల ఖర్చు అధికంగా అవుతోంది, మరో వైపు గులాబీ రంగు పురుగుతో దిగుబడి రాను రాను తగ్గిపోతోంది. ఓ వైపు పెట్టుబడి పెరిగి దిగుబడి తగ్గుతున్న క్రమంలో గిట్టుబాట ధర లేకపోవడం శాపంగా మారుతోంది. ఏటా తీవ్ర నష్టాలు చవిచూస్తున్న రైతులు పత్తిపంట సాగుకు విముఖత చూపుతున్నారు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టిపెడుతున్నారు. గత కొన్నేళ్లుగా పల్నాడు ప్రాంతంలో పత్తిసాగు చేసిన రైతులు తీవ్ర నష్టాలను చవిచూడటంతో మొక్కజొన్న సాగుతోనైనా తమ వెతలు తీరుతాయని రైతులు భావిస్తున్నారు.

లక్ష్యంలో సగమైనా లేదు

జిల్లా సాధారణ లక్ష్యం ఈ ఖరీఫ్‌లో 91,566 హెక్టార్లు కాగా ప్రస్తుతానికి కేవలం 35,958 హెక్టార్లలో సాగైంది. పత్తి పంట సాగుకు అనువైన సమయం దాదాపుగా పూర్తయిందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇక మీదట సాగు చేసే పత్తి పంటకు చివర్లో గులాబీ రంగు పురుగుల బెడద అధికంగా ఉండి తీవ్రంగా నష్టపోతామంటున్నారు. దీంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో పత్తి పంట సాగు 40 వేల హెక్టార్లు కూడా దాటే పరిస్థితి లేదంటున్నారు.

గిట్టుబాటు ధర లేదు



గతంలో పత్తి, మిర్చి పంటలను అధికంగా సాగుచేసే వాడిని. కానీ అధిక వర్షాలు, గులాబీ రంగు పురుగు ఉధృతితో పాటు, గిట్టుబాటు ధర లేక పత్తి పంట సాగు గణనీయంగా తగ్గించుకున్నాను. రైతులు గత కొంత కాలంగా కంది, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారిస్తున్నారు. ఈ పంటలకు పెట్టుబడి తక్కువ ఉండటం, అధిక ఆదాయం ఉండటం కలసి వస్తుంది.

– వెంకట్రామిరెడ్డి, రైతు, రెడ్డిపాలెం, రొంపిచర్ల మండలం

సాగు మరింత తగ్గుతుంది..



పత్తి పంటతో పోల్చితే కంది పంటసాగు పెట్టుబడి చాలా తక్కువ. చీడ. పీడల బెడద తక్కువ ఉండటం సాగు ఖర్చు తక్కువ ఉండటానికి కారణం. మరోవైపు గత రెండు మూడేళ్లుగా కందికి గిట్టుబాటు ధర అనుకూలంగా ఉంటోంది. దిగుబడి సైతం ఆశించిన మేర వస్తోంది. రాను రాను జిల్లాలో పత్తి పంట సాగు మరింత తగ్గే అవకాశముంది.

– బీరవలి రామిరెడ్డి, రైతు, జూలకల్లు , గురజాల నియోజకవర్గం

ప్రజాస్వామ్యం అపహాస్యం

పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల తీరుపై డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ధ్వజం



నరసరావుపేట రూరల్: రాష్ట్రంలో జెడ్పీటీసీ ఉప ఎన్నికలు జరిగిన తీరు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చగా మిగులుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పులివెందులలో టీడీపీని గెలిపించడానికి ఎన్నికల సంఘం, పోలీసు శాఖ ఇంతగా దిగజారాలా అని ప్రశ్నించారు. దేశ చరిత్రలో ఇంత దారుణంగా ఎన్నికల జరిగిన ఘటనలు లేవన్నారు. స్థానిక గుంటూరు రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు.. పోలింగ్ కేంద్రాలు రెండు కిలోమీటర్లలోపు ఉండాలని ఎన్నికల సంఘం నిబంధనలు ఉన్నప్పటికీ నాలుగు కిలోమీటర్ల దూరంలోని మరో గ్రామంలోకి మార్చారన్నారు. దాదాపు నాలుగు వేల మంది ఓటింగ్‌లో పాల్గొనకూడదనే కుట్రతోనే ఎన్నికల కమిషన్ ఈ చర్యకు పాల్పడిందన్నారు. నిస్వార్థంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన ఎన్నికల సంఘం అధికారపార్టీకి వత్తాసు పలకడం దారుణమన్నారు.

ప్రజలు ఓటు వేయరని తెలిసే అక్రమాలు

తెల్లవారుజామున కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, సతీష్‌రెడ్డిలను అరెస్ట్ చేసిన పోలీసులు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, బీటెక్ రవిలను స్వేచ్ఛగా తిరగనిచ్చారన్నారు. వారు గ్రామాల్లో తిరుగుతూ పోలింగ్‌బూత్‌లలోకి ప్రవేశించి భయబ్రాంతులకు గురిచేసారని తెలిపారు. ఒంటిమిట్ట పరిధిలోని పోలింగ్‌బూత్‌లో రాంప్రసాద్‌రెడ్డి వీరంగం సృష్టించి వైఎస్సార్ సీపీ పోలింగ్ ఏజెంట్‌పై దాడికి పాల్పడ్డారన్నారు. జమ్మలమడుగు, ఇతర నియోజకవర్గాల నుంచి దొంగ ఓటర్లను తీసుకువచ్చి ఓటింగ్ జరిపించి ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ఏజెంట్లను పోలీసులే బయటకు పంపడం విడ్డూరన్నారు. ఇంతకన్నా జెడ్పీటీసీ సభ్యులుగా టీడీపీ వ్యక్తులను ప్రకటించుకుంటే సరిపోయేదన్నారు. పులివెందుల ప్రజలు తమకు ఓట్లు వేయరని అంచనాకు వచ్చిన కూటమి నాయకులు ఈ అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. ఎన్నికల సంఘంపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్న సమయంలో రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ వ్యవహరించిన తీరు బాధకరమని తెలిపారు. ప్రజాస్వామ్యవాదులు ఈ తరహా ఎన్నికల నిర్వహణను వ్యతిరేకించాలని కోరారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి

ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి

మాచర్ల: రాష్ట్రంలో మెరుగైన విద్యుత్ సరఫరాతో పాటు, ఉత్తమ సేవలందించాల్సిన బాధ్యత విద్యుత్ శాఖ ఇంజినీర్లపై ఉందని ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజినల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజినల్ పరిధిలోని ఇంజినీర్లు, అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో కరెంట్ బిల్లుల వసూళ్ల విధానం మారిపోతుందని, బకాయిలు పేరుకుపోకుండా చూసుకోవాలని సూచించారు. బకాయిలు ఉన్న ప్రభుత్వ శాఖల అధికారులను కలిసి బకాయిలు క్లియర్ చేయకపోతే చర్యలు తప్పవని సూచించాలని తెలిపారు. టెక్నికల్ ఎలక్ట్రికల్ డైరెక్టర్ మురళీ కృష్ణ యాదవ్, విజయ్‌కుమార్, ఈఈ ఎస్.సింగయ్యతో పాటు పలువురు డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న పుల్లారెడ్డి

స్మార్ట్ మీటర్లు బిగించుకోండి..

రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటుందని సీఎండీ పి.పుల్లారెడ్డి అన్నారు. మాచర్లలోని కేసీపీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో పలు ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

ఈ–పంట నమోదు ప్రారంభం



సత్తెనపల్లి మండలం నందిగామలో ఈ–పంట నమోదు చేస్తున్న వీఏఏ, పక్కన ఏఓ సుబ్బారెడ్డి

షెడ్యూల్ ఇలా..

పంట నమోదుకు గడువు	సెప్టెంబర్ 15 వరకు
గ్రామ సభల నిర్వహణ	సెప్టెంబర్ 19–24 వరకు
ఫిర్యాదుల స్వీకరణ	25 నుంచి 28 వరకు
తుది జాబితా ప్రచురణ	సెప్టెంబర్ 30

సత్తెనపల్లి: జిల్లా వ్యాప్తంగా 330 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఈ–పంట నమోదు ప్రారంభమైంది. అధికారులు గ్రామాల్లోకి వచ్చి పంట వివరాలు నమోదు చేస్తున్నారు. రైతులకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వాల్సి ఉంది. వెబ్‌ల్యాండ్ ఆధారంగా జిల్లాలో 10.06 లక్షల ఎకరాల్లో భూములు ఉండగా 99.96 ఎకరాల్లో పంటల సాగు అవుతున్నట్లు రికార్డుల్లో ఉంది. దీనిలో ఇప్పటివరకు 3,985 ఎకరాల్లో ఈ–పంట నమోదు చేశారు. వ్యవసాయ పంటలకు మండల వ్యవసాయ అధికారి, ఉద్యాన పంటలకు ఉద్యాన శాఖ అధికారి, ప్రభుత్వ/వ్యవసాయతర భూములకు తహసీల్దారులకు నమోదు పర్యవేక్షణ బాధ్యతను అప్పగించారు. ఇప్పటివరకు గ్రామాల్లో సాగు చేసే పంటలను మాత్రమే ఈ–పంట నమోదు చేస్తుండే వారు. అయితే కొత్తగా ప్రభుత్వభూములు, వ్యవసాయేతర భూములు, బీడు భూములు, పశువుల పాకలను కూడా ఈ–పంట నమోదు చేయాలన్న ఆదేశాలు వ్యవసాయ అధికారులకు అందాయి. దీంతో ఏయే పంటల సాగు చేస్తున్నారనే వివరాలతో పాటు అదనంగా వ్యవసాయేతర భూములు కూడా నమోదు చేయనున్నారు.

ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఊరట

ఈ–పంట నమోదు చేసుకునే రైతులకు ప్రభుత్వ పథకాలతో పాటు సాయం అందు తుంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలకు నష్టం వాటిల్లితే ఈ–పంట నమోదు చేసుకున్న వారికి మాత్రమే పరిహారం అందుతుంది. ఈ–పంట నమోదు చేసుకోలేని రైతులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం దక్కదు. అధికారులు పొలాల్లోకి వచ్చి పంటలు, బీడు భూములు వివరాలు నమోదు చేసుకునే సమయంలో రైతులు అందుబాటులో ఉండాలి.

–ఎం.జగ్గారావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, పల్నాడు

ఉధృతంగా ఎద్దువాగు

నకరికల్లు నుంచి శివాపురం తండా, ఉదయ్‌నగర్‌లకు నిలిచిన రాకపోకలు



నకరికల్లు నుంచి శివాపురం తండా వెళ్లే రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న ఎద్దు వాగు

నకరికల్లు: మండల కేంద్రమైన నకరికల్లు నుంచి శివాపురం తండా, ఉదయ్‌నగర్ కాలనీలకు వెళ్లే రోడ్డుపైకి వాగునీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. గత రెండుమూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు నకరికల్లు రిజర్వాయర్‌కు ఆనుకొని ఉన్న ఎద్దువాగు పొంగి ప్రవహిస్తుంది. స్థానిక చెరువు వద్ద నుంచి ఇనిమెట్ల, ఉప్పలపాడు వరకు ప్రవహించే ఈ వాగు పొంగినప్పుడల్లా రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నకరికల్లు నుంచి శివాపురం తండా, ఉదయ్‌నగర్ కాలనీలకు వెళ్లే రోడ్డుపైకి నడుములోతు నీరు వచ్చిచేరడంతో రాకపోకలు స్థంభించిపోయాయి. వాహనదారులు నర్సింగపాడు మీదుగా నకరికల్లు చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాదచారులు చేసేదిలేక నడుములోతు వాగులో నుంచి నడుచుకుంటూ వస్తున్నారు. గతంలో కూడా భారీవర్షాలకు రోడ్డుపై వాగునీరు చేరడంతో రాకపోకలు స్థంభించిపోయాయి. రెండుగ్రామాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నా అధికారులు చూస్తూ మిన్నకుండిపోతున్నారు. వాగును పరిశీలించిన ఏఐకెఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి తూమాటి మణికంఠ మాట్లాడుతూ వాగుపై కల్వర్టు నిర్మాణం చేసి రెండుగ్రామాల ప్రజల అవస్థలు తీర్చాలని కోరారు.

పీసపాడు వద్ద...

పీసపాడు(క్రోసూరు): ఎగువన బెల్లంకొండ, పిడుగురాళ్ల వైపు కురిసిన భారీ వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని పీసపాడు గ్రామంలో ఎద్దువాగు బ్రిడ్జి ఎత్తులో నీళ్లు పొంగి ప్రవహిస్తున్నాయి. వరద నీరు జోరుగా ఇతర అందుకూరు, బాలెమర్రు, బయ్యవరం గ్రామాల వాగులు గుండా ప్రవహించి కృష్ణానదిలో కలుస్తాయి. 2016, 2017లో పీసపాడు ఎద్దువాగు మీద ఉన్న హైలెవల్ బ్రిడ్జి మీదుగా వరద పొంగింది.

నేర రహిత సమాజానికి కృషి చేయాలి

సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్ కుమార్ రెడ్డి



సమీక్ష చేస్తున్న న్యాయమూర్తులు విజయ్ కుమార్ రెడ్డి, తాషిద్ హుస్సేన్, సృజిన్ కుమార్

సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజ మార్గమని, నేర రహిత సమాజ కోసం అందరూ కృషి చేయాలని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. వచ్చే నెల 13వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ క్రిమినల్ కేసులు రాజీ చేయాలని, దీనిపై పోలీస్ అధికారులతో పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో సత్తెనపల్లి న్యాయస్థానాల పరిధిలో ఉన్న ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ముందుగా ఆయా స్టేషన్లలో ఉన్న రాజీ పడదగిన సెక్షన్లు ఉన్న కేసులు ఎన్ని ఉన్నాయనే వివరాలు తెలుసుకున్నారు. ఆయా స్టేషన్లు పరిధిలో ఉన్న కాంపౌండబుల్ నేరాల కేసులు అన్నీ వచ్చే నెల 13న జరిగే లోక్ అదాలత్ పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. సమీక్షలో న్యాయమూర్తులు తాషిద్ హుస్సేన్, జె.సృజిన్‌కుమార్, సత్తెనపల్లి డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు, సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్, ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

పిడుగురాళ్లరూరల్: నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్ర ఒక్కటే నివారణ అని జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నులిపురుగుల వల్ల రక్త హీనత, నీరసం, కడుపులో నొప్పి వంటివి ఎదురవుతాయని, నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఆయన సూచించారు. ఒకటి నుంచి 19 సంవత్సరాలవారికి ఈ మాత్రలను అందజేస్తున్నామని తెలిపారు.

ఇదేంది రొయ్యో..!

- రొయ్య రైతుకు ధరాభారం
- ట్రంప్ సుంకాల బూచి చూపి ధరల తగ్గింపు
- అమెరికాకు 100 కౌంట్ రొయ్యల ఎగుమతి లేకపోయినా ధర తగ్గింపు
- జిల్లాలో 21 వేల ఎకరాల్లో రొయ్యలసాగు
- 70 శాతం వనామీ, 30 శాతం టైగర్ సాగు
- సాగు దారుల్లో 60 శాతం మంది కౌలు రైతులే..
- ఎగుమతి కంపెనీలు, వ్యాపారులు కలిసి వంచిస్తున్నారంటూ రైతుల గగ్గోలు



బాపట్ల జిల్లాలో రొయ్యల చెరువు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకం బూచి చూపి ఎగుమతి దారులు, కంపెనీలు రొయ్యల ధరలను అమాంతం తగ్గించడంతో రైతులు లబోదిబో మంటున్నారు. ధరలు పతనం కావడంతో జిల్లాలో 60 శాతానికి పైగావున్న కౌలు రైతులు మరింతగా నష్టపోతున్నారు. పెట్టుబడి రాని పరిస్థితిలో ఆందోళన చెందుతున్నారు. నెల రోజుల క్రితం వనామీ 100 కౌంట్ ధర రూ. 270 ఉండగా ప్రస్తుతం రూ.225కు తగ్గింది. టైగర్ రొయ్య 20 కౌంట్ ధర నెల రోజుల క్రితం రూ. 680 ఉండగా ప్రస్తుతం 570కి తగ్గింది. ఈ లెక్కన నెలరోజుల్లో వనామీ ధర రూ. 45, టైగర్ ధర రూ. 100 తగ్గింది. దీనివల్ల లాభాల సంగతి దేవుడెరుగు పెట్టు బడులు కూడా రావని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

పెట్టుబడులు వచ్చే పరిస్థితి లేదు

రొయ్యల సాగు పెట్టుబడులు ఏడాది కేడాదికి పెరుగుతున్నాయి. విద్యుత్ బిల్లులు రెట్టింపవగా, జీవ రసాయన మందుల ధరలు అయాంతం పెరిగాయి. పెరిగిన వర్కర్స్ జీతాలు దీనికి తోడయ్యాయి. దీంతో ఎకరం రొయ్యల సాగుకు రూ.4లక్షల నుంచి 5 లక్షల ఖర్చవుతోంది. ఈ లెక్కన పెట్టుబడులు రావాలంటే వనామీ 100 కౌంట్ కౌలు రైతు అయితే రూ. 250 అమ్మాలి. సొంత రైతు అయితే రూ.225 అమ్మాలి. కానీ ప్రస్తుతం ధరలు అంతకు మించి తగ్గాయి. దీంతో లాభాల సంగతి దేవుడెరుగు పెట్టుబడులు వచ్చే పరిస్థితి కానరావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

ఎకరాకు రూ.లక్షపైనే నష్టం

రొయ్యల ఉత్పత్తి బాగా ఉంటే ఎకరానికి 2 టన్నులు దిగుబడి ఉంటుంది. ప్రస్తుతం సగటున ఎకరానికి 1.50 టన్నులకు మించి దిగుబడి రావడంలేదు. ఈ లెక్కన వున్న ధరతో ఎకరాకు రూ. 3.50 లక్షలకు మించి రాబడి వుండడంలేదు. దీంతో ఎకరాకు సొంత రైతుకు రూ.లక్షకు తగ్గకుండా, కౌలు రైతు రూ. 1.50 లక్షల నుంచి 2 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తోంది. ఎకరం కౌలు చెరువులనుబట్టి రూ. 50 వేల నుంచి రూ. 1లక్ష ఉంది. కౌలు రైతులకు వడ్డీలు అదనపు భారంగా మారనున్నాయి. దీంతో రొయ్య రైతులు లబోదిబోమంటున్నారు.

ట్రంప్ సుంకాల బూచి చూపి..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన సుంకాల బూచి చూపి ఎగుమతి దారులు, కంపెనీలు రైతులను నిలువునా ముంచుతున్నాయి. వాస్తవానికి 100 కౌంట్ రొయ్య అమెరికాకు వెళ్లదు. కేవలం 20, 30, 40, 50 కౌంట్ రొయ్యలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. జిల్లాలో వనామీలో అధికంగా 100 కౌంట్ రొయ్యల విక్రయాలు మాత్రమే సాగుతున్నాయి. వనామీ 100 కౌంట్ రొయ్య చైనా, గల్ఫ్ దేశాలకు ఎగుమతి అవుతోంది. అమెరికాకు రొయ్య ఎగుమతి కాకుండానే ఎగుమతి దారులు, వ్యాపారులు ట్రంప్ సుంకాల పేరుతో ఇబ్బడి ముబ్బడిగా ధరలు తగ్గించి రొయ్య రైతును దోపిడీ చేస్తున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

రొయ్య రైతులను ఎగుమతి వ్యాపారులు, కంపెనీలు ట్రంప్ సుంకాల పేరుతో వంచిస్తున్నా కూటమి సర్కారుకు చీమకుట్టినట్లు కూడా లేదు. ఆది నుంచి రైతులంటే గిట్టని బాబు సర్కార్ రొయ్య రైతులను పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ధరలు స్థిరంగా ఉండేలా చూసి నష్టపోకుండా చర్యలు తీసుకున్నారు. వారికి సబ్సిడీతో విద్యుత్ అందించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా విద్యుత్ చార్జీల భారాన్ని మోపి రొయ్య రైతులను ఇబ్బందులను గురిచేస్తోంది.